క్లుప్తంగా

సీసీ నిర్మాణానికి శంకుస్థాపన



అప్పారెడ్డిపల్లిలో శంకుస్థాపన చేస్తున్న పద్మారెడ్డి

మాడ్గుల: మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ పద్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మ, మాజీ వార్డుసభ్యులు వెంకట్‌రెడ్డి, జంగయ్య, స్థానిక నాయకులు నారాయణ, రాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల్: మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్ తండాతో పాటు, పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువుతండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం కొండ్రిగానిబోడ్‌తండాతో పాటు, పెద్దారెడ్డి చెరువు తండాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు అధికారులు, నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని వారు కోరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ప్రత్యేధికారి శ్రీనివాస్, కార్యదర్శి లింగారెడ్డి, మాజీ సర్పంచ్ సేవ్యాబావోజీ పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన నాయకులు



ఏసీపీని సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: మహేశ్వరం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వర్‌ను శనివారం కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఏసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంబాలపల్లి అంజి, అశోక్ తదితరులు ఉన్నారు.

హస్తం గూటికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రంగారెడ్డి



మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు బాలరాజ్, శంకరయ్య శనివారం హస్తం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శంకరయ్య కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచి అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. మల్‌రెడ్డి సమక్షంలో తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, మాజీ మార్కెట్ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, రమేశ్, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, జగదీశ్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

వైభవంగా రథోత్సవం



రథంపై అధిష్ఠించిన దేవతామూర్తులు

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం వైభవంగా కొనసాగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణి, సత్యభామ వేణుగోపాల స్వామి విగ్రహాలను అధిష్ఠించి ఆలయ పరిసరాల్లో ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మంజుల, మాజీ ఉప సర్పంచ్ గణేశ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ నర్సింహాగౌడ్, పండితులు రామానుజన్ చార్యులు, ఆదిత్యాచార్యులు, స్థానిక నాయకులు బాల్‌రాజ్, చెన్నయ్య, సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్, కృష్ణ, జనీల్, రాజు, రమేశ్, శ్రీను, యాదయ్య భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) మూలవిరాట్



- లక్ష్మీచెన్నకేశవస్వామి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- వారం రోజుల పాటు వైభవంగా సాగనున్న ఉత్సవాలు
- ఆలయాన్ని ముస్తాబు చేసిన నిర్వాహకులు
- భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విశేష చరిత్ర గలిగిన ఆలయంలో భక్తుల గోవిందనామ స్మరణ మధ్య ఉత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాలు ఈ నెల 20న మంగళవారం ప్రారంభమై 26వ తేదీ సోమవారం ముగియనున్నాయి. జాతర ఉత్సవాల కోసం ఆలయ చైర్మన్ ఆంజనేయులు, బ్రహ్మోత్సవ నిర్వాహణ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, ప్రధాన అర్చకుడు వెంకటేశ్వర శర్మల ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల వివరాలను ఆలయ నిర్వాహకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అనువంశిక అర్చకులు వివరించారు.

ఉత్సవాల కార్యక్రమాల వివరాలు

▲20న స్వస్తి పుణ్యాహవాచనం, విశ్వక్సేన పూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, అంకురార్పణ

▲21న అమ్మవారికి ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామ పారయణం, స్వామివారి ఎదురుకోళ్లు,

▲22న కల్యాణోత్సవం, వేదోక్త ఆశీర్వచనములు, బాలలచే భగవద్గీత పారాయణం, భజనలు, ప్రసాద వితరణ, శివాలయం వద్ద అగ్నిగుండాలు,

▲23న ప్రత్యేకపూజలు, విష్ణు సహస్రనామ పారాయణం, మండపారాధన పుష్పమాల సేవ, చిన్నరథోత్సవం, హనుమాన్ చాలీసా పారాయణం.

▲24న కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం, రాత్రికి స్వామి వారి పెద్దతేరు ఉత్సవం నిర్వహిస్తారు.

▲25న హనుమాన్‌చాలీసా పారాయణం, వడమాల, పారిజాత పుష్పార్చన, రాత్రికి స్వామివారి దోపోత్సవం,

▲26వ తేది సోమవారం ప్రత్యేక పూజలతో పాటు చక్రతీర్థం, గరుడసేవ ఊరేగింపు, కోలాట బృందంచే అడుగుల భజన, కుంకుమార్చన, నాగవల్లిలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

వైభవంగా నిర్వహిస్తాం



బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతున్నాం.

వేణుగోపాల్, బ్రహ్మోత్సవ నిర్వాహణ కమిటీ చైర్మన్

ప్రత్యేక ఆకర్షణగా రథోత్సవం

చెన్నకేశవస్వామి ఉత్సవాల్లో పెద్ద రథోత్సవం ప్రతి ఏటా కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఉత్సవ విగ్రహాలను రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తారు. కల్వకుర్తి నియోజకవర్గంలోనే అతి పెద్ద తేరు (రథం)గా కడ్తాల్ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలోని తేరు ప్రత్యేక గుర్తింపు పొందింది. రథోత్సవంలో పాల్గొనడానికి గ్రామంతో పాటు పరిసర మండలాల, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా చరణ్, ఆర్‌జేడీగా శ్రావణి, డీఈవోగా అక్షయ, ఎంఈవోగా శివ వ్యవహరించగా, మరో 16 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తమ తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు కిశోర్ తదితరులు ఉన్నారు.

ముద్విన్ పాఠశాలలో...

ముద్విన్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంగా భార్గవ్, విద్యాశాఖ మంత్రిగా శివకుమార్, కలెక్టర్‌గా శైలజ, ఆర్‌జేడీగా శ్రీజ, డీఈఓగా కావేరి, డిప్యూటీ ఈఓగా ప్రణతితో పాటు 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయుడు భీముడు తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని రిషి టాలెంట్ హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వపరిపాలన దినోత్సవంలో ఆర్‌జేడీగా నాగమణి, డీఈఓగా హన్సిక, ఎంఈఓగా అభిజ్ఞ, కరస్పాండెంట్‌గా ఆకాశ్, ప్రిన్సిపాల్‌గా సంపత్‌కుమార్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ బహుమతులు ప్రధానం చేశారు.

వరిలో మొగి పురుగు.. నివారణ ఇలా..

మంచాల: యాసంగిలో సాగు చేసిన వరిని మొగి (పీక) పురుగు ఎక్కువగా ఆశిస్తోందని తగిన సమయంలో నివారణ చేపట్టాలని వరి పరిశోధన స్థానం కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి సూచించారు. పురుగు ఉధృతిని గమనించి దీపపు ఎరలు, లింగార్షక బట్టలు ఏర్పాటు చేయడం వలన మొగి పురుగును నివారించవచ్చని అన్నారు. శనివారం మంచాల మండల పరిధిలోని బోడకొండ గ్రామంలో వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరలతో పురుగులు బుట్టల్లో పడిపోతాయని తెలిపారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బట్టలు పెట్టి అందులో వారానికి 20 నుంచి 30 పురుగులు పడినప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పంట నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, వ్యవసాయ అధికారి శిరీష, రైతులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ ప్రాంగణంలో అట్టహాసంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. తొమ్మిది జతల కాడీలు వచ్చాయి. ఎస్‌ఐ శ్రీకాంత్ పందెం గుండు (బండలాగుడు) పోటీలను ప్రారంభించారు. కడారి పెద్ద జంగయ్య ఎద్దులు రూ. 15,000 ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బైకని రాములు ఎద్దుల జత రూ. 10,000 ద్వితీయ బహుమతి, గోనుల కృష్ణయ్య ఎద్దుల జత రూ. 5,000 తృతీయ బహుమతిని అందుకున్నారు. వంగూరి మహేశ్ సహకారంతో రైతులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరశర్మ, ఎంపీటీసీ వందన, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణమ్మ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

తలకొండపల్లి: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చంద్రధనలో ఆయన మాట్లాడారు. మోదీతోనే దేశ భద్రత, అభివృద్ధి సాధ్యమని తెలిపారు. గ్రామాలభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక నిధులను మంజూరు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి మూడోసారి మోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం

ఇబ్రహీంపట్నం రూరల్: సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను జిల్లా కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సైబరాబాద్ క్రైమ్ డీసీపీ నర్సింహ ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

పాఠశాలకు వంట పాత్రల వితరణ

మంచాల: మండల పరిధిలోని కాగజ్‌ఘట్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీఎస్‌ఆర్ (తిరుమణి సాయిశ్రేతన్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వంట పాత్రలు వితరణ చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మానవ సేవే.. మాధవ సేవా అనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ముందుకు పోతుందన్నారు. అదే విధంగా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు , ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం

తహసీల్దార్ రవీందర్

అబ్దుల్లాపూర్‌మెట్ : గతంలోనే లే అవుట్లు చేసి ప్లాట్లుగా విక్రయించిన భూములను రిజిస్ట్రేషన్లు చేయాలని తమపై ఒత్తిడి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధరణి రికార్డు సాకుతో భూములకు పాసుపుస్తకాలు, రిజిస్ట్రేషన్లు చేయాలంటూ మండల పరిధిలోని గ్రామాలకు చెందిన పలువురు తహసీల్దార్ కార్యాలయానికి వస్తూ తమపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. గతంలో ప్లాట్లు చేసిన భూములకు సంబంధించిన వివరాలు అప్పటి పహాణీలో నమోదు చేయకపోవడంతో పట్టాదారుల పేర్లు వస్తుండడంతో ధరణి రికార్డు ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుని ప్లాట్లు ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదర్శంగా నిలవాలి

కడ్తాల్: ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకుని, పది మందికి ఆదర్శంగా నిలవాలని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో దివంగత ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్‌రెడ్డి (ఎస్‌జేఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్, శిఖర ఐఏఎస్ అకాడమీ సహకారంతో 10 మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్స్‌గా, ఒకరు గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు శనివారం లీలా లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు.

మల్‌రెడ్డికి కృతజ్ఞతలు



మల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: అవిశ్వాసం వీగిపోయేందుకు సహకరించి, తన పదవిని కాపాడిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం తన భర్త కప్పరి చందు, మామ కప్పరి లక్ష్మయ్యలతో పాటు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నేతలతో కలిసి మల్‌రెడ్డిని కలిశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి సారించాలని రంగారెడ్డి సూచించినట్లు ఆమె తెలిపారు.

తండాల అభివృద్ధికి కృషి

ఎంపీపీ అనిత

ఆమనగల్లు: గ్రామాలు, గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆమనగల్లు ఎంపీపీ అనిత చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో అంతర్గత రోడ్లు శుభ్రంగా మారుతున్నాయని ఆమె చెప్పారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఎంపీపీ నిధులు రూ.2.10 లక్షలు, ఈజీఎస్ కింద రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం ఎంపీపీ అనిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటయ్య, నాయకులు మల్లేశ్, విజయ్‌రాథోడ్, పురుషోత్తం, హేమ, సోమ్లు, వినయ్, శ్రీను, హనుమ పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.10,116, మూడవ బహుమతిగా రూ.5,116 అందించారు. టోర్నమెంట్‌లో పాఠశాల స్థాయిలో బాలుర విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ ఆకుతోటపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ కడ్తాల, జెడ్పీహెచ్‌ఎస్ నాదర్‌గుల్, బాలికల విభాగంలో బాలనగర్ గురుకుల పాఠశాల, కల్వకుర్తి గురుకుల పాఠశాల, ఆమనగల్లు వివేక విద్యాభారతి పాఠశాలలు బహుమతులు గెలుచుకున్నాయి. పురుషుల విభాగంలో విన్నర్‌గా శెట్టిపల్లి సత్యం టీమ్, రన్నర్‌గా చరికొండ టీం, మూడవ బహుమతి దేవునిపడకల్ టీమ్‌లు గెలుచుకున్నాయి. మహిళల విభాగంలో జీహెచ్‌ఎంసీ ఆధ్యానగర్ టీమ్, రన్నర్‌గా నల్గొండ టీమ్, మూడవ బహుమతి కల్వకుర్తి టీమ్‌లు గెలుచుకున్నాయి విజేతలైన టీంలకు జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎగిరిశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవి నగదు బహుమతి, షీల్డ్‌లను అందించారు. ముగింపు కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొగులయ్యకు సన్మానం

మంచాల: పద్మశ్రీ అవార్డు గ్రహీత, 12 మెట్ల కిన్నెర వాయిద్యకారుడు దర్శనం మొగులయ్యను మంచాల సీఐ బాబ్యనాయక్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలో ప్రాచీన సంప్రదాయాలు, కళలు, సాంస్కృతిని కాపాడుకోవల్సిన అవసరం చాల ఉందన్నారు. వందల సంవత్సరాల నాటి కిన్నెర వాయిద్యం ద్వారా తన కళ ప్రదర్శనంతో పద్మశ్రీ అవార్డు అందుకొని మొగులయ్య అందరికి ఆదర్శంగా నిలిచాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎస్‌ఐ రవి నాయక్, లాలయ్య, ఏఎస్‌ఐ సతీష్ , సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అందజేత

మంచాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం నగరంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్ సంస్థ వారి సహకారంతో రూ.4లక్షల స్కాలర్‌షిప్ అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ.. మంచాల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 49 మంది (బాలికలు) విద్యార్థులు స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి రూ.8వేల చొప్పున రూ.4లక్షలు అందజేశారు.

వివాహానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ కల్ గ్రామానికి చెందిన మహేశ్వరి అనే యువతికి పెళ్లి నిశ్చయమైంది. మహేశ్వరి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.15 వేలు, మాజీ సర్పంచ్ శ్రీశైలం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో రామస్వామి, రమేశ్, శంకర్, మల్లేశ్, శ్రీను పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పదోతరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా.. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడ వెనకబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ విద్యార్థుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా.. నూతన భవనాన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి జంగయ్య, ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలోని అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు, చక్రతీర్థం కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో మాజీ సర్పంచ్ గోదాదేవి, సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కోట్ల జగన్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఇబ్రహీంపట్నం: స్ఫూర్తి జ్యోతి ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



కడ్తాల్: కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు



తలకొండపల్లి: జంగారెడ్డిపల్లిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఆమనగల్లు: కేక్ కట్ చేస్తున్న అర్జున్‌రావు, అనురాధ

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు
- మాజీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన గులాబీ నేతలు

ఇబ్రహీంపట్నం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వినోబానగర్‌లోని స్ఫూర్తి జ్యోతి ఆశ్రమంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. అనంతరం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు జగదీశ్వర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని, మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వారు ఆకాంక్షించారు.